## క్లుప్తంగా

### భూ వివాదాలను పరిష్కరించేందుకే రీ సర్వే

**జయంతి(వీరులపాడు):** భూ వివాదాలను పరిష్కరించేందుకే ప్రభుత్వం భూముల రీ సర్వే చేపట్టిదని తహసీల్దార్ ఆశియ నాయక్ పేర్కొన్నారు. మండలంలోని జయంతి గ్రామంలో వైఎస్సార్ జగనన్న భూ హక్కు భూ రక్ష పథకాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. 100 ఏళ్ల క్రితం భూముల సర్వే నిర్వహించారని దీంతో భూ వివాదాలు అధికంగా వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూముల రీ సర్వే చేపట్టారని తెలిపారు. డ్రోన్ కెమెరాలతో అత్యాధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో రీ సర్వే నిర్వహిస్తామని, సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారపాక మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి పాల్గొన్నారు.

### ఘనంగా ప్రారంభమైన ప్రతిష్టోత్సవాలు



**నందిగామ:** పట్టణంలోని రామలింగేశ్వరనగర్‌లో ఉన్న సాయి అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో పలు దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత గణపతి పూజ, దీక్ష కంకణ ధారణ, గోపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పలువురు వేద పండితుల మంత్రాల నడుమ పలు రకాల హోమాలు జరిగాయి. పలువురు దంపతులు పీటలపై కూర్చొని ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

### 90.91 శాతం పింఛన్ల పంపిణీ



**నందిగామ:** నియోజకవర్గంలో బుధవారం 90.91 శాతం మంది లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుక అందింది. గ్రామ/వార్డు వలంటీర్లు వేకువ జాము నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. నందిగామ పట్టణంతోపాటు నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం కొనసాగింది.

### ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



**కంచికచర్ల:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించటంతో పాటు మెరుగైన సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని ఎంఈఓ ఎల్.చిట్టిబాబు అన్నారు. కంచికచర్ల వసంతకాలనీ ఎంపీపీ స్కూల్‌లో ఆయన బుధవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు ఎంఈఓ మాట్లాడుతూ.. బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్చేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. ఈ ప్రాంత విద్యార్థులు జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లేందుకు వీలుగా వాహన వసతి కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం విద్యార్థుల నోటు పుస్తకాలు, ఉపాధ్యాయులు డైరీ, లెసన్‌ప్లాన్, పాఠశాల ప్రగతి, నాడు-నేడు రికార్డులను పరిశీలించారు. హెచ్‌ఎం వేమవరపు ప్రసాద్, సీఆర్పీలు బంకా బడేమియా, రాజు, కిరణ్ కుమార్, విజయలక్ష్మి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఈ-క్రాప్‌తో పంటలకు బీమా



**వీరులపాడు:** పంటలకు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవటం వల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటల బీమా వర్తిస్తుందని ఏడీఏ రమణమూర్తి సూచించారు. మండలంలోని వెల్లంకి గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో ఈ-క్రాప్ నమోదుపై బుధవారం ఆయన అవగాహన కలిగించారు. రైతులు విధిగా తాము సాగు చేస్తున్న పంటలకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. రబీ సీజన్‌లో మండలంలో 2,430 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హుసేన్‌బీ, ఎంపీటీసీ సభ్యురాలు వేమిరెడ్డి సీతామహాలక్ష్మి, నాయకులు వేమిరెడ్డి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు**



కంచికచర్లలో మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

**కంచికచర్ల:** అర్హులు అందరికీ సంక్షేమ పథకాలను అందించాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు అన్నారు. మండల కేంద్రమైన కంచికచర్లలోని 16,17 వార్డుల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం బుధవారం జరిగింది. ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు ప్రతి గడపకూ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ, ఆర్బీకే సెంటర్లు, మనబడి నాడు-నేడు, లక్షల సంఖ్యలో ఇళ్ల పట్టాల పంపిణీ, వైఎస్సార్ సున్నా వడ్డీ, అమ్మ ఒడి, విద్యా దీవెన, ఉన్నత కులాల్లోని నిరుపేదలకు ఆర్థికసాయం వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు.

**పింఛన్ల పంపిణీ**

వైఎస్సార్ పింఛన్ కానుకను పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తెల్లవారకముందే లబ్ధిదారుల ఇంటికే వలంటీర్లు వెళ్లి పింఛన్ నగదు అందజేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో లబ్ధిదారులు అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, సర్పంచి వేల్పుల సునీత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, ఎంపీటీసీ సభ్యుడు మాడుగుల మధుబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, నాయకులు దేవరపల్లి గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, తోట వెంకటబేబి, తంగిరాల సృజనీకుమార్, వేల్పుల రమేష్, వేల్పుల శ్రీనివాస్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, మేకల బాబు, చలమల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి : సీఐ



మాట్లాడుతున్న సీఐ నాగ మురళి

**జగ్గయ్యపేట అర్బన్:** విద్యార్థులు గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని జగ్గయ్యపేట సీఐ ఎ.నాగమురళి సూచించారు. స్థానిక జేఆర్సీ-విశ్వభారతి డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం 'మాదకద్రవ్యాలు-వినియోగం' అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. యువత సన్మార్గంలో నడిచి తమ ఉజ్వల భవిష్యత్‌కు పునాది నిర్మించుకోవాలని సూచించారు. యవ్వనంలో మత్తు పదార్థాలు, గుట్కా, గంజాయి, లిక్కరుకు బానిసలై బంగారు భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దన్నారు. వచ్చే మూడు నెలల్లో ఆంధ్రరాష్ట్రాన్ని మత్తుపదార్థాల రహిత రాష్ట్రంగా చూడాలని, దానికోసం అందరం కృషిచేయాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం మాదక ద్రవ్యాల రహిత ప్రతిజ్ఞ చేశారు. ఎస్ఐ బి.వి.రామారావు, కళాశాల ప్రిన్సిపాల్ కె.ఎస్.రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జె.తిరుపతిరావు, కళాశాల ప్రతినిధులు జె.అబ్బులు, వి.నారాయణరావు పాల్గొన్నారు.

**వ్యసనాలకు బానిస కావొద్దు**

**వీరులపాడు:** యువత వ్యసనాలకు బానిస కాకుండా శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్ఐ సోమేశ్వరరావు సూచించారు. మత్తు పదార్థాలు తీసుకోవటం వల్ల కలిగే నష్టాలపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆయన అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ త్రోబాల్ పోటీలకు డానియేల్ ఎంపిక



రిచార్డ్ డానియేల్‌ను అభినందిస్తున్న సిస్టర్ మాధురి, జోస్టిన్ శబర్‌ముత్తు తదితరులు

**కంచికచర్ల:** మండలంలోని గండేపల్లి గ్రామానికి చెందిన కొయ్యగూర రిచార్డ్ డానియేల్ త్వరలో జాతీయస్థాయిలో జరిగే త్రోబాల్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఆ విద్యార్థి నందిగామ మరియనివాస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. జనవరి 28 నుంచి 30 వరకు నంద్యాల పట్టణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి త్రోబాల్ అండర్-14 బాలుర విభాగంలో డానియేల్ సత్తాచాటాడు. పాఠశాలలో హెచ్‌ఎం మాధురి, పీడీ శ్రీనివాసరావు, కరస్పాండెంట్ జోస్టిన్ శబర్‌ముత్తు, వందనకుమార్ తదితరులు రిచార్డ్ డానియేల్‌ను బుధవారం అభినందించారు.

## అనధికారిక వెంచర్లపై దృష్టి పెట్టండి: ఆర్డీఓ



డివిజన్ పరిధిలోని సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్రరావు

**నందిగామ:** డివిజన్ పరిధిలో వ్యవసాయ భూములను కన్వర్షన్ చేయకుండా వెంచర్లు వేస్తే చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులు, సిబ్బందిని ఆర్డీఓ రవీంద్రరావు ఆదేశించారు. డివిజన్ పరిధిలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవసాయ భూమిని కన్వర్షన్ చేయకుండానే వెంచర్లు వేస్తున్న నేపథ్యంలో స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో ఆర్డీఓ బుధవారం సమీక్ష నిర్వహించారు. నందిగామ పట్టణ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రియల్ వెంచర్లపై ఆరా తీశారు. కన్వర్షన్ చేయకుండా వెంచర్లు వేసే వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కన్వర్షన్ లేని భూముల్లో ఏర్పాటు చేసిన ప్లాట్లను వినియోగదారులు కొనుగోలు చేసి నష్టపోవద్దని సూచించారు.

## అధికారుల సూచనలు పాటించండి

**ఉద్యాన శాఖాధికారి నరేంద్రకుమార్**



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారి నరేంద్రకుమార్

**ఎ.కొండూరు:** మామిడి తోటలకు తేనే మంచు పురుగు ఉధృతి అధికంగా ఉందని దీని నివారణకు ఉద్యాన శాఖ సూచించే సలహాలు పాటించాలని ఉద్యాన శాఖ అధికారి బి. నరేంద్రకుమార్ అన్నారు. మండలంలోలని కోడూరు గ్రామంలో తోటబడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిపూత దశలో తేనే మంచుపురుగు ఉధృతి అధికంగా ఉండటం వల్ల రసాన్ని పీల్చి తేనే వంటి ప్రదార్థాన్ని విసర్జిస్తాయన్నారు. వీటి వల్ల శిలీంద్రాలు పెరిగి ఆకుల మీద మసిమంగు ఏర్పడి కిరణ జన్య సంయోగ క్రియ జరగక పూత మొగ్గలు పెరగవన్నారు. దీని నివారణకు క్లోరోఫైరిఫాస్ 2 ఎంఎల్, సల్ఫర్ 10 గ్రాములు, బోరాన్ రెండు గ్రాములు, లీటర్‌నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. తేనే మంచు పురుగు, తామర పురుగులు రెండు ఉన్నప్పుడు ఈమీడ క్లోఫ్రిడ్ 3 ఎంఎల్ వాడాలని, గంధకం బూడిద తెగుళ్ల రాకుండా కాపాడుతుందన్నారు. తోటల్లో సాయంత్రం వేళల్లో పొగబెట్టడం, తక్కువ లోతులో దుక్కులు దున్నడం వల్ల పూతలు రావటానికి ఎక్కువగా అవకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ సహాయకులు టి.రాజేష్, రైతులు పాల్గొన్నారు.

### రక్తదానం ఉత్తమమైనది

**బస్టాండ్(విజయవాడ పశ్చిమ):** అన్ని దానాల్లోకెల్లా రక్తదానం ఉత్తమైనదని డాక్టర్ సమరం పేర్కొన్నారు. జనవరి 27 నుంచి ఈనెల రెండో తేదీ వరకు జరిగే ఏపీఎస్ ఆర్టీసీ 34వ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం పండిట్ నెహ్రూ బస్టేషన్ డిస్పెన్సరీలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ సమరం మాట్లాడుతూ.. మనిషి ప్రాణాన్ని కాపాడేది రక్తమేనన్నారు. రక్తదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. శిబిరంలో 77 మంది ఆర్టీసీ ఉద్యోగులు రక్తదానం చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు, జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎం.ఏసుదానం, డెప్యూటీ సీటీఎంలు జాన్ సుధాకర్, బషీర్ అహ్మద్, ఆర్టీసీ జిల్లా సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వర్ణకుమారి, వివిధ డిపోల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో లక్ష తులసీదళార్చన



**నెమలి(గంపలగూడెం):** జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గంపలగూడెం మండలం నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాల చార్యులు, అర్చక బృందం స్వామికి లక్ష తులసీ దళాలతో విశేష అర్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాజ్యలక్ష్మీదేవికి దశ సహస్ర కుంకుమార్చన చేశారు. ఏకాహ దీక్షతో హరే రామ నామ సంకీర్తన జరిపారు. అనంతరం శ్రీకృష్ణ తారక మహాహోమం, శాంతి హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ డి.శ్రీరామ వరప్రసాదరావు, పాలకవర్గ సభ్యులు నూకల నాగలక్ష్మణరావు, వెంకట కృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

### మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

**ముసునూరు:** భక్తులకు కల్పించే సౌకర్యమే ఉత్సవాలకు విజయం ఇస్తుందని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్, ఇన్‌చార్జ్ ఆర్డీఓ పెంచల కిషోర్ అన్నారు. తహసీల్దార్ దాసరి సుధ ఆధ్వర్యంలో బలివేలోని మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను బుధవారం అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలివే రామలింగేశ్వర స్వామిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆలయ నిర్మాణ చరిత్ర, స్వామి మహిమలు అడిగి తెలుసుకున్నారు. ఆలయ కమిటీ అధికారులు ఆలయ మర్యాదలతో గౌరవించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, ఎంపీడీఓ జి.రాణి, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, పర్యవేక్షకుడు సాయిరాము, కార్యదర్శి యోహాన్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## పాప్ కార్న్ చిత్రం యూనిట్ సందడి



మాట్లాడుతున్న హీరోయిన్ అవికా గోర్

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** పాప్ కార్న్ చిత్ర యూనిట్ నగరంలో సందడి చేసింది. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా బుధవారం యూనిట్ సభ్యులు నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో హీరోయిన్ అవికా గోర్ మాట్లాడుతూ పాప్‌కార్న్ చిత్రం యువతను ఎంతగానో ఆకట్టుకుంటుందన్నారు. సినిమాలో ఎక్కువ భాగం ఒక లిఫ్ట్‌లోనే చిత్రీకరించామని చెప్పారు. లిఫ్ట్‌లో జరిగే సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తాయన్నారు. ప్రేమ కథా చిత్రమని, హాస్య సన్నివేశాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటాయని ఆమె పేర్కొన్నారు. దర్శకుడు మురళీ కొత్త దర్శకుడు అయినప్పటికీ ఈ చిత్రాన్ని ఒక ప్రతిభగల దర్శకుడు మాదిరిగా చిత్రీకరించారన్నారు. ఇప్పటికే పాటలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని, ట్రైలర్, టీజర్‌కు విశేష స్పందన లభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. హీరో సాయి రోనక్ మాట్లాడుతూ తాను నాలుగు చిత్రాల్లో హీరోగా నటించానని, తొలిసారిగా అవికా గోర్ లాంటి సీనియర్ హీరోయిన్‌తో నటించడం సంతోషంగా ఉందన్నారు. చిత్రాన్ని యువతతో పాటు కుటుంబ సభ్యులందరూ కూడా చూసే చిత్రమని తెలిపారు. దర్శకుడు మురళీ మాట్లాడుతూ.. తను చాలా షార్ట్ ఫిల్మ్స్ చేశానని, ఆ అనుభవంతో తొలిసారిగా పాప్ కార్న్ చిత్రం తీశానన్నారు. సమావేశంలో చిత్ర సహ నిర్మాత చలపతిరాజు పాల్గొన్నారు.

### వైభవంగా రామలింగేశ్వరుడి కల్యాణోత్సవాలు



లలిత త్రిపురసుందరీ దేవిగా దర్శనమిస్తున్న శ్యామలాంబ అమ్మవారు

**నందిగామ:** స్థానిక రామలింగేశ్వరుని ఆలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్యామలాంబ అమ్మవారిని లలిత త్రిపుర సుందరీదేవిగా అలంకరించి విశేష పూజలు, కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం వేళ పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. రాత్రికి స్వామిని అశ్వవాహనంపై ఊరేగించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పెన్షనర్లు ఈకేవైసీ చేయించాలి



మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు

**కంచికచర్ల:** ప్రభుత్వ పెన్షనర్లు తప్పనిసరిగా ఈకేవైసీ ధ్రువీకరణ చేయించుకోవాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సాని రామమోహన్‌రావు సూచించారు. స్థానిక రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘ కార్యాలయంలో బుధవారం అవగాహన సమావేశం జరిగింది. రామమోహన్‌రావు మాట్లాడుతూ.. పెన్షనర్లు ఆధార్ కార్డు, సీఎఫ్ఎంఎస్ ఐడీ కార్డు నంబర్, ఆధార్‌కు లింకయిన మొబైల్ నంబర్, ఇంటి నంబర్, అడ్రస్ తీసుకుని కంచికచర్ల ఉప ఖజానా కార్యాలయ అధికారిని సంప్రదించాలని సూచించారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లోని విశ్రాంత ఉద్యోగులు అందరూ సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. సీఎఫ్ఎంఎస్ నంబర్, వివరాలు కావాలంటే కార్యాలయంను సంప్రదించాలని పేర్కొన్నారు. సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, కోశాధికారి చలసాని నాగేశ్వరరావు, పెద్దినీడి కోటేశ్వరరావు, సీహెచ్ స్వర్ణలత, బి.వి.సర్వేశ్వరరావు, షేక్ జానీ మియా తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్ కానుక



లబ్ధిదారులకు నగదు పంపిణీ చేస్తున్న మునిసిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఖాదర్‌బాబు

**జగ్గయ్యపేట అర్బన్:** దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే వెళ్లి వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ విధానాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని మునిసిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని యానాదుల కాలనీలో బుధవారం ఉదయం సచివాలయం కన్వీనర్ షేక్ ఖాదర్‌బాబుతో కలిసి తుమ్మల ప్రభాకర్ పింఛన్లు పంపిణీచేశారు.

## తిరుపతమ్మ కల్యాణానికి తలంబ్రాలు సిద్ధం



కల్యాణ తలంబ్రాలు కలుపుతున్న భక్తులతో ఆలయ ఈఓ, చైర్మన్, తదితరులు

**పెనుగంచిప్రోలు:** గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో కల్యాణ తలంబ్రాలును కలిపే కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల ఐదో తేదీన శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణం జరగనుంది. ఈ నేపథ్యంలో క్వింటా బియ్యాన్ని పసుపు, కుంకుమ, నెయ్యి, పలు సుగంధ ద్రవ్యాలతో భక్తులతో తలంబ్రాలు కలిపించారు. కల్యాణ వేదిక వద్ద నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసి అమ్మవారి కల్యాణం అనంతరం భక్తులందరికీ ఈ తలంబ్రాలను పంపిణీ చేస్తామని ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ జి.వి.డి.ఎన్.లీలాకుమార్, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఏఈఓ కొండలరావు, పాలకవర్గ సభ్యులు, మహిళా భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధమవుతున్న నూతన రథం



నిర్మాణంలో ఉన్న రథం

**నందిగామ:** పట్టణంలోని రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు ప్రతి ఏటా మాఘ మాసంలో జరుగుతాయి. ఈ నేపథ్యంలో స్వామి వారి కల్యాణ అనంతరం పౌర్ణమి నాడు పట్టణంలో రథం తిరునాళ్ల జరుగుతుంది. ఇప్పటి వరకు వినియోగించిన రథం జీర్ణావస్థకు చేరింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ ఎప్పటిలాగానే స్వామి వారి రథం తిరునాళ్ల వైభవంగా జరగాలని పట్టుదలతో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆలయ చైర్మన్ వాసిరెడ్డి మురళీరాఘవకుమార్ పర్యవేక్షణలో ఈఓ ధూళిపాళ సుబ్రహ్మణ్యం దగ్గరుండి కొత్త రథం తయారు చేయిస్తున్నారు. ఈ రథం 25 అడుగుల ఎత్తు ఉంటుందని, పనులు దాదాపు పూర్తయ్యాయని, ఈ ఏడాది స్వామి గ్రామోత్సవం నూతన రథంపై నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ తెలిపారు.

## మత సామరస్యానికి ప్రతీక షాబూఖారీ దర్గా



షాబూఖారీ దర్గాలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెల్లంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా, తదితరులు

**కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** హజ్రత్ సయ్యద్ షాబూఖారీ బాబా దర్గా మతసారస్యానికి ప్రతీకగా నిలుస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా అన్నారు. దర్గా 426వ ఉరుసు ఉత్సవాల్లో బుధవారం వారు వేర్వేరుగా ఉత్సవాల్లో పాల్గొన్నారు. బాబా వారికి చాదర్ సమర్పించారు. ఆస్థాన పీఠాధిపతి, సూఫీ మత గురువు మహ్మద్ అల్తాఫ్ రజా మేళతాళాలతో వారికి సాదరంగా ఆహ్వానం పలికారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బాబా వారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. అన్నదాన కార్యక్రమం ప్రారంభించి భక్తులకు నిత్యం జరుగుతున్న అన్నదాన కార్యక్రమాన్ని కొనియాడారు. వేడుకల్లో ఎమ్మెల్సీ రుహుల్లా, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఖాజా, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ వాజీద్‌ఖాన్, 54వ డివిజన్ కార్పొరేటర్ హర్షద్, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నవదిన ప్రార్థనలు



సమష్టి దివ్యబలి పూజ నిర్వహిస్తున్న ఫాదర్ రవితానయ్య

**గుణదల(విజయవాడతూర్పు):** భక్తుల కోర్కెలు తీర్చే బంగారు తల్లిగా గుణదల మాత నీరాజనాలందుకుంటోందని రీజనల్ సుపీరియర్ ఇండియా రెవ ఫాదర్ మార్నెని రవితానయ్య అన్నారు. గుణదల మేరిమాత పుణ్యక్షేత్రంలో నవదిన ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రార్థనల రెండో రోజైన బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. మరియమాత స్త్రీలందరిలో పవిత్రమైన వ్యక్తిగా పేరుపొందిందని తెలిపారు. ఆమె భక్తికి మెచ్చి దేవాది దేవుడు ఆమెను ఎన్నుకున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మరియమాతను ప్రార్థించడం ద్వారా సకల శుభాలు జరుగుతాయని చెప్పారు. దేవుని పట్ల విధేయతతో నడుచుకోవాలని, ఆయన ప్రేమ మార్గాన్ని అనుసరించాలని కోరారు. అనంతరం మరియమాత బలి పీఠం వద్ద సమష్టి దివ్య పూజ నిర్వహించారు. అంతకు ముందు పుణ్యక్షేత్ర గురువులు, మఠ కన్యలు, పలు విచారణల నుంచి వచ్చిన విశ్వాసులు కొవ్వొత్తులు చేతబూని కొండ పైకి చేరుకున్నారు. జపమాల ధ్యానంతో మరియ తల్లిని వేడుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్, ఫాదర్ కొలకాని మరియన్న, ఫాదర్ విజయకుమార్ పాల్గొన్నారు.